క్లుప్తంగా

విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో నిర్మల్–ఖానాపూర్ రోడ్డు మధ్యలో రైతు నాగలి విగ్రహం ఏర్పాటు కోసం తిమ్మాపూర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్సీ దండె విఠల్ సహకారంతో విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కడుకుంట్ల రవి, నిమ్మల రమేశ్, నాగరాజు, రవి, ప్రదీప్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

గ్రామదేవతలకు చలిబోనాలు


శ్రీరాంనగర్‌లో బోనాలతో మహిళలు

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు ఆదివారం గ్రామ దేవతలకు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. తిమ్మాపూర్, ఖానాపూర్ పోచమ్మ ఆలయాలతోపాటు పలు గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చలిబోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అక్రమంగా ఇసుక తరలించొద్దు


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌తో సీఐ రాజారెడ్డి

భైంసాటౌన్: అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని భైంసా పట్టణ సీఐ రాజారెడ్డి అన్నారు. ఈమేరకు పట్టణంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు తెలిపారు. వీటిని సంబంధిత రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ

సారంగాపూర్: మండలంలోని తాంద్ర(జి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మౌలానా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సురేందర్, భూమేశ్, సలీమ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

జగదాంబదేవి జాతర

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాంతండాలో ఆదివారం జగదాంబదేవి జాతర ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద లంబాడాలు చేసిన నృత్యం ఆకట్టుకుంది.

అలరించిన వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి జూనియర్ కళాశాల 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల డ్యాన్స్‌లు, ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సమయం వృథా చేయకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శాంసుందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసవి కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాళ్లు సాయిలు, శ్రీనివాస్, డైరెక్టర్లు కదర్ల హరిప్రసాద్, జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గొల్లపేటలో నూతన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దీనికి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి వేద పండితులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ తదితరులు ఉన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం

నిర్మల్: ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని కడెం, పెంబి మండలాల బీజేపీ అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి ఆదివారం ప్రకటించినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కడెం మండల అధ్యక్షుడిగా కలనేని శ్రీనివాస్‌యాదవ్, పెంబి మండల అధ్యక్షుడిగా వెంకటేశ్‌ను నియమించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పంచాయతీలకు భవనాలేవి..?

- అద్దెభవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలు
- నిధులు మంజూరైనా చేపట్టని నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పనులు చేపట్టాలని అధికారులకు వేడుకోలు


ఇది పల్సి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం. దీని నిర్మాణానికి 2021లో రూ.16లక్షలు కేటాయించగా రూ.2023లో రూ.10 లక్షలు మంజూరు చేశారు. మిగతా రూ.ఆరు లక్షలు రాకపోవడంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు నిలిపివేశారు.


ధార్‌కుబీర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న జీపీ కార్యాలయం

కుభీర్: మండలంలోని పలు పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో గ్రామసభలు, ఇతర సమావేశాలు నిర్వహించినప్పుడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త పంచాయతీలకు సొంత భవనాలు కరువయ్యాయి. దీంతో అద్దె భవనాల్లో పంచాయతీ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. పాత పంచాయతీల్లోనూ పలు చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్త గ్రామపంచాయతీల్లో భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

కుభీర్ మండలంలో..

జిల్లాలోనే పెద్ద మండలమైన కుభీర్‌లో మొత్తం 41 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో పాతవి 20 కాగా కొత్తగా ఏర్పాటు చేసినవి 21. నూతనంగా ఏర్పడిన పంచాయతీల్లో వీర్‌గాం గ్రామంలో పంచాయతీ కార్యాలయం ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతుంది. మిగతా 20 గ్రామపంచాయతీలు అద్దెభవనంలో కొనసాగుతున్నాయి. పాత పంచాయతీలైన పాంగ్ర, బెల్గాం గ్రామాల్లో ఉన్న సొంత భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో వీటిని కూడా అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు.

శిథిలావస్థకు పంచాయతీలు..

2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 10 గ్రామాల్లో ఒక్కో పంచాయతీ భవనానికి ఉపాధి నిధులు రూ.10లక్షల చొప్పున మంజూరు చేశారు. నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతో శిథిలావస్థకు చేరాయి. నిధులు మంజూరైనా పల్సిలో భవన నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. బెల్గాంలో ఇప్పటికీ నిర్మించలేదు. పాంగ్ర, హల్దా గ్రామాల్లో పనులు నాసిరకంగా చేపట్టడంతో కూలిపోయే స్థితికి చేరాయి. చొండి, పార్డి(కె) గ్రామాల్లోనూ భవనాలు దెబ్బతిన్నాయి. తర్వాత భవన నిర్మాణ వ్యయాన్ని రూ.16లక్షలకు.. తర్వాత రూ.20 లక్షలకు పెంచారు.

నిధులు మంజూరైనా..

నూతన పంచాయతీల్లో సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. బిల్లులు రావడం ఆలస్యమవుతుందని తాజా మాజీ సర్పంచ్‌లు నిర్మాణ పనులు చేపట్టలేదు. ప్రస్తుతం గ్రామపంచాయతీల ఆలనా పాలనా కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు చూస్తున్నారు.

భవనాల్లేక ఇబ్బందులు..

గ్రామాల్లో సొంత భవనాలు లేక అధికారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామసభలు, సమావేశాలు నిర్వహించినప్పుడు అద్దె ఇంటి వద్ద స్థలం సరిపోవడం లేదు. మరోవైపు ఒంటికి రెంటికి కష్టాలు పడుతున్నామని మహిళలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరైన గ్రామాల్లో భవన నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నాం


మా తండాను పంచాయతీగా ఏర్పాటు చేసి ఆరేళ్లవుతుంది. ఇప్పటికీ సొంత భవనం లేక చిన్నపాటి అద్దె ఇంట్లో పంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. సమావేశాల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. నిధులు మంజూరైన పనులు చేపట్టేందుకు ఎవరూ రావడం లేదు. – చవాన్ లక్ష్మణ్, బెల్గాంతండా

భవనం లేక ఇబ్బంది


మా గ్రామంలో పంచాయతీ భవనం లేక ఇబ్బందిగా ఉంది. గ్రామానికి అధికారులు వచ్చినప్పుడు, వైద్యశిబిరాలు, గ్రామసభలు ఏర్పాటు చేసినప్పుడు కష్టంగా ఉంది. ప్రభుత్వం వెంటనే గ్రామాలకు పంచాయతీ భవనాలు నిర్మించి ఇవ్వాలి.
– జాదవ్ గణపతి, కిషన్‌నాయక్ తండా

సర్పంచులు ముందుకు రాలేదు

మండలంలో కొత్తగా ఏర్పడిన 21 గ్రామపంచాయతీల్లో భవనాలు నిర్మించుకునేందుకు ఉపాధి నిధులు రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయి. పనులు చేసేందుకు సర్పంచులు ముందుకు రాలేదు. ప్రస్తుతం వారి పదవీకాలం పూర్తయింది. అధికారులు ముందుకొచ్చి భవన నిర్మాణాలు జరిగేలా చూడాలి.
– తూము లక్ష్మీబాయి, ఎంపీపీ

ఈరోజు

మహాధర్నా జయప్రదం చేయాలి

ఖానాపూర్: అలేఖ్య హత్య కేసు విషయంలో ప్రభుత్వం, పోలీసుల జాప్యానికి నిరసనగా పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో సోమవారం చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని పలువురు అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితుడికి ఉరి శిక్ష విధించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదిలీ చేసేలా దశల వారీగా ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు.

శోభాయాత్ర జయప్రదం చేయాలి

ఖానాపూర్: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సోమవారం నిర్వహించే భారీ శోభాయాత్రను జయప్రదం చేయాలని భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాసవేని ప్రణయ్ కోరారు. ఆదివారం ఆయన ఖానాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ఐబీ చౌరస్తాలో ధ్వజారోహణ అనంతరం ఈ శోభాయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. హిందూ బాంధవులు తరలిరావాలని కోరారు.

ముధోల్ ఎమ్మెల్యే రాక

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో శివాజీ మహరాజ్ విగ్రహాన్ని సోమవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ఆవిష్కరించనున్నట్లు ఆర్యమరాఠా సంఘం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల్లోని ఆర్యమరాఠా నాయకులు, సంఘం సభ్యులు హాజరు కావాలని కోరారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసాటౌన్: శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, సినీనటుడు, బీజేపీ నాయకులు సర్దార్ అభినవ్ అన్నారు. భైంసా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సంత్ సేవాలాల్ చౌక్‌లో ఆదివారం సేవాలాల్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారు సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బీజేపీ నాయకులు బాలాజీ సూత్రావే అన్నదానం చేశారు. కార్యక్రమంలో బంజారా సమాజ్ భైంసా సభ్యులు నాజంసింగ్, పాండు, బలిరాం రాథోడ్, గులాబ్‌సింగ్, జాదవ్ జ్ఞానేశ్వర్, జాదవ్ ప్రకాశ్, గబ్బర్‌సింగ్ తదితరులున్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

తానూరు: ప్రతి ఒక్కరూ సంత్ సేవాలాల్ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బంజారా సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకలు నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. అంతకుముందు సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి జై సేవాలాల్ అంటూ నినాదాలు చేశారు. బంజార సంస్కృతి ప్రకారం యువకులు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాన్‌సింగ్, పలువురు నాయకులు పుండలిక్, సురేశ్, కైలాస్, దినేశ్, గణేశ్ తదితరులు ఉన్నారు.


తానూరు : పూజలు చేస్తున్న నాయకులు

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

సోన్: ఆలయాల్లో ధూప దీప నైవేద్య అర్చకులుగా పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ధూపదీప అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు యోగేశ్‌కుమార్‌శర్మ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కడ్తాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆదేశాల మేరకు ఈనెల 20న చేపట్టే చలో సెక్రటేరియట్‌లో అర్చకులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ధూపదీప నైవేద్య అర్చకుల సమస్యల పరిష్కారం, నూతన అర్చకులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనం విడుదల, ఉద్యోగ భద్రత తదితర సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని చెప్పారు. జిల్లాలోని అర్చకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

భైంసాటౌన్: గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతి సందర్భంగా కుభీర్‌లో చేపట్టిన శోభాయాత్రలో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, ఆలిండియా బంజారా సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. శోభాయాత్రలో కొందరు రాళ్లదాడి చేయగా చవాన్ అవినాశ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా దుండగులను అరెస్ట్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన నిందితులు ఐదుగురితోపాటు మరో 30 మంది దాడికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొంటున్నారని.. వారని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో ఆలిండియా బంజారా సేవా సమితి జిల్లా నాయకులు తుకారాం, అశోక్ నాయక్, గోవింద్‌నాయక్, భైంసా నాయకులు నాజంసింగ్ ఉన్నారు.


మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు

ఉద్యోగ, ఉపాధికి స్కిల్స్ తప్పనిసరి

నిర్మల్: ఉద్యోగం సాధించేందుకు, ఉపాధి పొందేందుకు స్కిల్స్ తప్పనిసరి అని విద్యార్థి దశ నుంచే వీటిని పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భీంరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని దీక్ష డిగ్రీ కళాశాలలో వారంపాటు నిర్వహించిన మహీంద్రా ప్రైడ్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు గ్రూప్‌డిస్కషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్ తదితర నైపుణ్యాలపై మహీంద్రా ప్రైడ్ నిర్వాహకులు శిక్షణనిచ్చారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి రంగాల కోసం ఉపయోగించుకోవాలని భీంరావు సూచించారు. గతేడాది తమ కాలేజీ నుంచి బి.స్నేహ అనే విద్యార్థిని అమెజాన్‌లో రూ.13లక్షల వార్షిక వేతనానికి ఎంపికైనట్లు దీక్ష డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెంగ శ్రీధర్ వివరించారు. అంతకుముందు శిక్షణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో మహీంద్రా ప్రైడ్ శిక్షకులు రమేశ్, దీక్ష కళాశాల డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శిక్షణపత్రాలతో విద్యార్థులు

భీమన్న గదల ఊరేగింపు


పాక్‌పట్లలో ఊరేగింపు నిర్వహిస్తున్న సభ్యులు

సోన్: మండలంలోని పాక్‌పట్లలో భీమన్న పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నాయక్‌పోడ్‌లు భీమన్న గదల(విగ్రహాల) ఊరేగింపు నిర్వహించారు. నాయక్‌పోడ్‌లు భాజాభజంత్రీల నడుమ గోదావరి నుంచి తీసుకొచ్చిన గంగా జలంతో ఆలయంలోని విగ్రహాలకు అభిషేకం చేశారు. సోమవారం జాతర, మహా అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు మల్లేశ్, గంగాధర్, సాయన్న, ముత్యం తదితరులు తెలిపారు.

వద్యాల్‌లో..


వద్యాల్‌లో స్వాగతం పలుకుతున్న భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్‌లో ఆదివారం భీమన్న గదలకు గంగాజలంతో అభిషేకం చేసేందుకు ఊరేగింపుగా గోదావరి తీరానికి వెళ్లారు. రాచాపూర్, వద్యాల్ గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు భీమన్న గదలకు స్వాగతం పలికారు. గంగాజలంతో అభిషేకం అనంతరం రాత్రికి ఆలయాల్లోకి భీమన్న గదలు రానున్నాయి. దీంతో సోమవారం జాతర ప్రారంభం కానుంది.
వద్యాల్‌లో జాతర సందర్భంగా భీమన్న ఆలయం వద్ద గ్రామానికే చెందిన తాళ్ల సుదర్శన్ రూ.50వేలతో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయించాడు. ఆయనకు పలువురు ధన్యవాదాలు తెలిపారు.

గజ్జలమ్మ దేవికి ప్రత్యేక పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్, అప్పారావుపేట్, శివుని, మలక్‌జాం ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. చిన్నారుల తలనీలాలు, తులాభారం వేయించి నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. కుంటాలకు చెందిన విద్యుత్ ఉద్యోగి గాజుల సుమాళిని–భూమన్న దంపతులు గజ్జలమ్మ దేవికి రూ.19వేల విలువైన మూడు గ్రాముల బంగారు ముక్కు పుడకను బహూకరించారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. సభ్యులు జక్కని గజేందర్, ఎల్లమ్మల శంకర్, తాటి శివ, సంజీవ్, పోశెట్టి, రాజు, గజ్జారాం, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.


భూమన్న దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

నిర్మల్‌లో 40 ఏళ్లకు క్రికెట్ ఆడిన జట్టు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్మల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో 40 ఏళ్ల కిందట క్రికెట్ ఆడిన సీనియర్లు.. ఆదివారం ఒక్కరోజు క్రికెట్ ఆడారు. వారంతా ఒక చోట చేరి తమ జ్ఞాపకాలను యువకులతో పంచుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ హాజరై పోటీలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఈ మ్యాచ్ ఆడేందుకు నిర్మల్‌కు వచ్చారు.


జట్టుతో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

పంటలకు మద్దతు ధర కల్పించాలి

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. మద్దతుధర చట్టం కోసం హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో చలో ఢిల్లీ నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం నిర్బంధకాండను నిలిపివేయాలని కోరారు. రైతులు చేస్తున్న ఉద్యమానికి తాము సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో మంచికంటి లక్ష్మణ్, గుట్ల ప్రసాద్, మల్లేశ్, స్వామి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకర చెట్లను తొలగించరూ..


కడెం: మండల కేంద్రం నుంచి ఉడుంపూర్ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన చెట్లు ఒకవైపు వంగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు తమపై పడుతాయోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు ప్రమాదకరంగా మారిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.
ప్రశ్నించాల్సిన అధికారి: మల్లారెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్: 94906 51358

ఆపదలో 100కు డయల్ చేయండి


మాట్లాడుతున్న ఎస్సై లింబాద్రి

ఖానాపూర్: ఆపదలో ఆందోళన చెందకుండా విద్యార్థులు డయల్ 100, 1930కు సమాచారం ఇవ్వాలని ఎస్సై లింబాద్రి అన్నారు. ఆదివారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమస్య ఎదురైనప్పుడు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సోషల్ మీడియాకు దూరం ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. సైబర్ మోసాల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.